క్లుప్తంగా

సీపీని కలిసిన ఎస్సై



నల్లబెల్లి : వరంగల్ కమిషనరేట్ పరిధిలోని నల్లబెల్లి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన గోవర్ధన్ సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను కమిషనరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. సీపీ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నీతి, నిజాయితీతో పని చేయాలని ఎస్సైకి సూచించారు.

బీఆర్ఎస్ దళిత నాయకుల అరెస్టు

గీసుకొండ : రెండో విడత దళితబంధు నిధులను విడుదల చేయాలని డిమాండ్‌చేస్తూ బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో స్థానిక పోలీసులు పలువురు నేతలను సోమవారం తెల్లవారు జామున అదుపులోకి తీసుకున్నారు. దళితబంధు మండల కమిటీ అధ్యక్షుడు కోట ప్రమోద్, నాయకులు నమిండ్ల రాజు, కేదాసి ఐలయ్య, మంద రాజేందర్, గాలి అన్వేష్‌లను అదుపులోకి తీసుకుని అరెస్టు చేయగా వారు రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ దుయ్యబట్టారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి



పర్వతగిరి: సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఎంఈఓ జి.లింగయ్య అన్నారు. మండలంలోని బూర్గుమళ్ల ఎంపీయూపీఎస్‌లో 64 మంది విద్యార్థులకు ప్రభుత్వ ఉపాధ్యాయురాలు చందా శోభారాణి-రమేష్, చందా రాహుల్‌లు రూ.25వేల విలువ చేసే బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ అనేది వ్యక్తి ఉన్నత వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుందని తెలిపారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం పి.రమేష్‌బాబు, హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్, ఏఏపీసీ చైర్మన్ భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీల ఎన్నిక



గీసుకొండ: మండల కేంద్రంలోని బీజేపీ బూత్ కమిటీల అధ్యక్షుల ఎన్నికలు పార్టీ పరకాల నియోజకవర్గ కన్వీనర్ ముల్క ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. 159వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా పాకనాటి శ్రీకాంత్, 160వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా చాపర్తి నవీన్, 161వ కమిటీ అధ్యక్షుడిగా కోట అనిల్‌ను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎన్నికైన అధ్యక్షులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కత్తి రమేష్, వెంకటేశ్వర్లు, కందికొండ రాజు, ప్రదీప్, అనిల్, పొగాకు సదానందం తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ బేకరీ యూనియన్ అసోసియేషన్ ఎన్నిక



రాజు,అధ్యక్షుడు

నర్సంపేట : నర్సంపేట డివిజన్ బేకరీ యూనియన్ అసోసియేషన్‌ను సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎనగందుల రాజు, ప్రధాన కార్యదర్శిగా గొడిశాల అనిల్, కోశాధికారిగా ఎండి.ఆఫ్తాబ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ డివిజన్‌లో 23 బేకరీ షాపులు యూనియన్ అసోసియేషన్‌లో భాగస్వామ్యం అయ్యాయన్నారు. యూనియన్‌లో ఎలాంటి సమస్యలు వచ్చినా తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. బేకరీ యజమానులు షాకీర్, కాంతారాజ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

టోర్నీ నిర్వహణకు ఆర్థికసాయం



గీసుకొండ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జనవరి 8 నుంచి నిర్వహించే 57వ రాష్ట్రస్థాయి సీనియర్స్ ఖోఖో పోటీల నిర్వహణకు రిటైర్డ్ స్టేట్ బ్యాంకు మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ-గీత దంపతులు రూ. 50 వేల సాయం చేయడానికి ముందుకు వచ్చారు. సోమవారం పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ కోట రాంబాబుకు సహాయం అందించారు. ఖోఖో జిల్లా అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వీరగోని స్వప్న, టోర్నీ సలహాదారుడు కర్ణకంటి రాంమూర్తి పాల్గొన్నారు.

శిథిలావస్థలో పురాతన ఆలయం

- కనుమరుగవుతున్న కాకతీయుల కళా వైభవం
- పునర్నిర్మాణం చేపట్టాలంటున్న గ్రామస్తులు



మల్లంపల్లిలో శిథిలావస్థకు చేరిన శివరామాలయం

దుగ్గొండి: పురాతన కాలంలో కాకతీయులు తమ రాజ్యాన్ని ఆధ్యాత్మికతకు నెలవుగా మార్చడానికి అనేక ఆలయాలు నిర్మించారు. వీటిలో చాలా ఆలయాలు నేటికి వేలాది మంది భక్తులతో ప్రతిరోజు కిటకిటలాడుతున్నాయి. కొన్ని ఆలయాలు దూప దీపనైవేద్యాలకు నోచుకోక, ఆలన పాలన కరువై శిథిలావస్థకు చేరాయి. మండలంలోని మల్లంపల్లిలో క్రీ:శ 1213-15 మధ్యకాలంలో కాకతీయ రాజైన ప్రతాపరుద్రుడు గ్రామంలో శివాలయం నిర్మించాడు. అత్యంత మహిమాన్వితమైన శివలింగాన్ని ప్రతిష్ఠించారు. నందీశ్వరుడు, గరుత్మంతుడు, ద్వారపాలకులను ఏర్పాటు చేశారు. అనేక ఏళ్ల పాటు ఇక్కడ ప్రతి ఏటా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక వేడుకలు జరిగినట్లు పూర్వీకులు అంటున్నారు. ప్రతాపరుద్రుడు రామప్ప, లక్నవరం, పాకాల ప్రాంతాల్లో వేటకు వెళ్లే క్రమంలో ఆలయ ఆవరణలో సేద తీరేవారని ప్రతీతి. ఆలయ ఆవరణలో కోనేరు సరస్సు సైతం ఉండేదని గ్రామస్తులు అంటున్నారు. కాలక్రమంలో ఆలయ ఆలన పాలన చూసే వారు కరువయ్యారు. దూపదీపనైవేద్యాలు పెట్టే వారు లేరు. గోపురాలు కొంత మేర కూలిపోయాయి. అయినా నేటికి శివలింగం మాత్రం చెక్కు చెదరకుండా భక్తిభావం ఉప్పొంగేలా ఆకర్షిస్తుంది. ఆలయం చుట్టూ 20 గుంటల భూమి ఉంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఆలయ పునర్నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పురాతన కాలం నాటి నందీశ్వరుడు

హద్దులు నిర్ణయించాం



కాకతీయుల కాలంలో నిర్మించిన ప్రధాన ఆలయాల్లో మల్లంపల్లి ఆలయం ఒకటి. దేవుడి మాన్యంలో కొంత అన్యాక్రాంతమైంది. తాను సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన మరుసటి రోజు నుంచే స్వాధీనం చేసుకుని శుభ్రం చేసి హద్దులు ఏర్పాటు చేశాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావడానికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారం కోరుతాం.

- చుక్క రమేశ్, మాజీ సర్పంచ్

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సంఘీభావం



చెన్నారావుపేట : నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



సంగెం : గవిచర్ల పాఠశాలలో నిరసన తెలుపుతున్నఉపాధ్యాయులు

చెన్నారావుపేట: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా భోజన విరామ సమయంలో ఉప్పరపల్లి హైస్కూల్ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ మద్దతు

జిల్లా కేంద్రంలోని ఏకశిల పార్కు వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు డీటీఎఫ్ మండల శాఖ మద్దతు తెలుపుతూ సంఘీబావం తెలిపారు.

సంగెం: మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతుగా నిలిచారు. మండలంలోని తిమ్మాపూర్, ఎల్గూర్‌రంగంపేట, గవిచర్ల, మొండ్రాయి పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయపర్తి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు మధ్యాహ్నం భోజన సమయంలో మండలంలోని రాయపర్తి, సన్నూరు, గట్టికల్, కొండూరు, కొత్తూరు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి

- సీఐ రాజగోపాల్



మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్

పర్వతగిరి: యువత సన్మార్గంలో పయనించాలని, మూఢ నమ్మకాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పర్వతగిరి సీఐ రాజగోపాల్ సూచించారు. మండలంలోని చౌటపల్లి గ్రామంలో పోలీస్ జాగృతి బృందం సోమవారం రాత్రి కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉండాలని, గ్రామంలో మద్యం, గుట్కా, పాన్ మసాలాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రవీందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి ప్రకటనను ఖండించిన మాజీ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అసెంబ్లీలో చేసిన ప్రకటనను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఖండించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా రోడ్ల నిర్మాణం చేయడానికి సంబంధించిన అన్ని నిధులను విడుదల చేశామని, ప్రతీ గ్రామ పంచాయతీతో పాటు, స్వచ్ఛభారత్ గ్రామాలు, తండాల్లో కొత్తగా రోడ్ల నిర్మాణం చేస్తున్నామని మంత్రి తప్పుడు ప్రకటన చేశారన్నారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో మంజూరు చేసిన వందల కోట్ల రూపాయలు రద్దు చేశారని అన్నారు. నర్సంపేట నియోజకవర్గానికి ఒక్క సారైనా వచ్చి సమీక్ష సమావేశం నిర్వహించే పరిస్థితి లేదన్నారు. కొత్త ప్రభుత్వం మార్పు వల్ల అభివృద్ధి ఆగిపోయిందని, కొత్త నిధులు అడిగే వారు ఎవరూ లేరన్నారు. ఇప్పటికైనా నర్సంపేట అభివృద్ధిపై దృష్టి సారించాలని పెద్ది కోరారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో అజామ్, శ్రీకాంత్, రమేష్ తదితరులు

వర్ధన్నపేట: మండలంలోని నల్లబెల్లిలో చమక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఉచితంగా ఆంగ్ల వ్యాకరణ (స్పోకెన్ ఇంగ్లిష్) పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. నిర్వాహకుడు చమక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విద్యావేత్త ప్రొఫెసర్ అజామ్, జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్‌లు పాల్గొని మాట్లాడుతూ చమక్ ఫౌండేషన్ ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తుండగా నేడు విద్యావేత్త వెంకట్ నారాయణ జ్ఞాపకార్థం పుస్తకాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆంగ్ల జ్ఞానంతో లక్ష్యాలను నెరవేర్చుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి కంప్యూటర్‌పై అవగాహన, కోడింగ్ లాంటి కోర్సులు విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోనే నేర్పించాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, ఏపీసీ అధ్యక్షురాలు చెంగల శ్రీలత, తాటికాయల కుమార్, సందీప్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డువెంట ఉన్న వాహనాలను తొలగించాలి

- బీసీ పవర్ పట్టణ యూత్ అధ్యక్షుడు బూస రంజిత్



రోడ్డుకిరువైపులా ఉన్న స్వర్గరథాలు, ఫ్రీజర్ బాక్స్‌లు

నర్సంపేట: పట్టణంలోని మాధన్నపేట రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా ఉన్న అంబులెన్స్, స్వర్గరథాలు, ఫ్రీజర్ బాక్స్‌లను తొలగించాలని బీసీ పవర్ పట్టణ యూత్ అధ్యక్షుడు బూస రంజిత్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రోడ్లకిరువైపులా అంబులెన్స్, స్వర్గరథాలు, ఫ్రీజర్ బాక్స్‌లు పెట్టడంతో స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు , ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రోడ్ల వెంట వెళ్లే సమయంలో వాటి నుంచి వచ్చే దుర్వాసనతో పిల్లలు, పెద్దలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు. ఈ విషయమై మునిసిపల్ అధికారులు చొరవ చూపి రోడ్లకు ఇరువైపులా వాహనాలు పెడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. కార్యక్రమంలో లక్ష్మి, రాజ్‌కుమార్, పొనగంటి ఐబి రాజ్‌రజక్, మమత, కవిత, మల్లికాంబ, సాంబయ్య, సురేష్‌నాయక్, పాల్గొన్నారు.

సంక్షిప్తం

గొర్రెల మందపై కుక్కల దాడి : 10 గొర్రెలు మృతి

నెక్కొండ: ఓ గొర్రెల మందపై కుక్కలు దాడి చేయగా 10 గొర్రెలు మృతి చెందిన సంఘటన మండలంలోని రెడ్లవాడ గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన మేకల శ్రీను గొర్రెల మంద ఏర్పాటు చేసుకున్నాడు. మందపై కుక్కలు దాడి చేయడంతో మృత్యువాత పడ్డాయి. సుమారు రూ. లక్ష మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గొల్ల, కురుమల సంఘం జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ డిమాండ్ చేశారు.

వృద్ధుడిపై కుక్క దాడి

సంగెం : వృద్ధుడిపై కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని గవిచర్లకు చెందిన పోశాల కొమురయ్య పనిమీద బయటకు వెళ్తున్న క్రమంలో కుక్క దాడి చేసి గాయపరిచింది. గ్రామాల్లో కుక్కల సంఖ్య బాగా పెరిగిపోయిందని మనుషులు, పశువులు, గొర్రెలపై దాడి చేస్తున్నాయని వాటిని నియంత్రించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

చెట్టుపైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

దుగ్గొండి: ప్రమాదవశాత్తు తాటిచెట్టు ఎక్కి కల్లు తీసి కిందికి దిగుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడి గీత కార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని లక్ష్మీపురంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన కక్కెర్ల శరత్‌కుమార్ వృత్తిలో భాగంగా సోమవారం కల్లు తీయడానికి చెట్టు ఎక్కాడు. కల్లు తీసి కిందికి దిగుతున్న క్రమంలో మోకుజారి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గీత కార్మికులు వరంగల్‌కు తరలించారు.

నిషేధిత పొగాకు ఉత్పత్తుల పట్టివేత

వర్ధన్నపేట: నిషేధిత పొగాకు ఉత్పత్తులను టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. పట్టణ కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నారన్న సమాచారంతో మహ్మద్ బాబా ఇంట్లో తనిఖీలు నిర్వహించగా రూ.7,620 విలువగల పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని వర్ధన్నపేట పోలీసులకు అప్పగించారు. బాబాపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

నల్లబెల్లి: సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య అన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ముప్పు కృష్ణకు సోమవారం వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

అయ్యప్పస్వాముల నగర సంకీర్తన

వర్ధన్నపేట: పట్టణ కేంద్రంలో సోమవారం అ య్యప్ప స్వాములు నగర సంకీర్తన కార్యక్రమం ని ర్వహించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పాల్గొని అయ్యప్పలతో కలిసి ఆడుతూ పాడుతూ నృత్యాలు చేశారు. మహా పడిపూజలో పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి: మండలంలోని ఏకేతండాలో కాంగ్రెస్ నాయకుడు బాద్యానాయక్ అన్న కూతురు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

సర్వేను పారదర్శకంగా చేపట్టాలి

- పర్వతగిరి ఎంపీడీఓ శంకర్‌నాయక్



పర్వతగిరి : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్



నర్సంపేట : 19వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేపడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పర్వతగిరి: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ సూచించారు. మండలంలోని ఏనుగల్లు, చింతనెక్కొండ, సీఐతండా, ఏబీతండా, ఇస్లావత్‌తండా, పర్వతగిరి గ్రామాల్లో సోమవారం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీఓ పాక శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సర్వేయర్లు, ఆయా పంచాయతీ కార్యదర్శులకు పలు సందేహాలను నివృత్తి చేశారు. రోజుకు 50 ఇళ్లను పూర్తి చేయాలన్నారు. డిసెంబర్ 31 వరకు పూర్తి చేయాలన్నారు.

ఎల్లాయగూడెంలో సర్వే

చెన్నారావుపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం సోమవారం మండలంలోని ఎల్లాయగూడెంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటి సర్వే నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి అభిలాష్ మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి ఇందిరమ్మ గృహపథకానికి అర్హులా కాదా అని పరిశీలించారు. అర్హత కలిగిన జాబితాను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఆయన వెంట గ్రామ పార్టీ అధ్యక్షులు జినుకుల కనుకమల్లు, మాజీ ఎంపీటీసీ వెంకన్న, జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ శ్రావణ్‌కుమార్, బుచ్చిరాములు, నర్సయ్యలు ఉన్నారు.

అర్హులకే ఇళ్లు

నర్సంపేట: ఇందిరమ్మ ప్రజాప్రభుత్వంలో అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడమే లక్ష్యమని కౌన్సిలర్ పెండెం లక్ష్మీరామానంద్ అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో సోమవారం ఇళ్ల లబ్ధిదారుల సర్వేను లక్ష్మీరామానంద్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లుతో పాటు, సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ ప్రవంతి, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, మాజీ ఎంపీటీసీ, సీనియర్ నాయకుడు కాట ప్రభాకర్, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకుబ్‌రెడ్డి, కీసరి వెంకటేశ్వర్లు, కీసరి నరేందర్, కొండి రాజేష్, కొలువుల నాని, కొలువుల శివ, పాల్గొన్నారు. అలాగే 11వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడు కుమారస్వామి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్ ఆధ్వర్యంలో కౌన్సిలర్ సునీత, వార్డు ఆఫీసర్ శ్రీలత సమక్షంలో సర్వేను చేపట్టారు. రాజేశ్వర్, జీవన్‌కుమార్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత



నల్లబెల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో మొబైల్ పోగొట్టుకున్న ఓ బాధితురాలికి ఫోన్ అప్పగించినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. ములుగు జిల్లా ఏటూరునాగారానికి చెందిన బట్ట ప్రత్యూష నల్లబెల్లి మండలంలోని రేలకుంటలో సెల్‌ఫోన్ పోయిందని నవంబర్ 22న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే మీ సేవలో ఫోన్ పోగొట్టుకున్నట్లు ఐఎంఈఐ నంబర్ ఆధారంగా దరఖాస్తు చేసింది. బాధితురాలు పూర్తి వివరాలను పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. ప్రత్యేక నిఘాను పెట్టి మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని బాధితురాలికి తిరిగి అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎస్సై మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు సెకండ్ హ్యాండ్ మొబైల్స్ తక్కువ ధరకు అమ్ముతుంటే ప్రజలు వాటిని కొనుగోలు చేవద్దని సూచించారు. అలాంటి వ్యక్తుల సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు.

పట్టుపురుగుల పెంపకంపై అవగాహన ఉండాలి

చెన్నారావుపేట : పట్టుపురుగుల పెంపకంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు గౌతమి అన్నారు. మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్ విద్యార్థులకు పట్టుపురుగుల పెంపకంపై అవగాహన కల్పించడానికి అమీనాబాద్ గ్రామానికి చెందిన రైతు దార రంజిత్ పట్టు పురుగుల కేంద్రంలో సోమవారం క్షేత్ర పర్యటన నిర్వహించారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కనులపండువగా అయ్యప్ప పడిపూజ




సంగెం : పడిపూజలో పాల్గొన్న బీజేపీ నాయకులు విజయచందర్‌రెడ్డి, అయ్యప్పస్వాములు

సంగెం: అయ్యప్ప శరణం నామస్మరణతో మండలంలోని నల్లబెల్లి మార్మోగిపోయింది. సోమవారం నీరటి రాజు ఇంట్లో నారికేల పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. బీజేపీ రాష్ట్ర నాయకులు పెసరు విజయచందర్‌రెడ్డి, డాక్టర్ కాశీప్రసాదరావులు పాల్గొని కొబ్బరి మొక్కను నాటారు. కార్యక్రమంలో నాయకులు కూతురు రాజు, మొలుగూరి శ్రీనివాస్, చంద్రమౌళి, భూక్య వెంకన్న, యూ కూ బ్, బాబు, రాజు, సాయి కుమార్, స్వామి, కుమారస్వామి, మాలధారులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో సోమవారం ఆలయ అర్చకులు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చింతల సాంబరెడ్డి-శ్రీలత, వెన్నంపల్లి వెంకటసత్యనారాయణశర్మ, బస్వోజు రమేష్‌జ్యోతి, యజ్జం వీరమాంబారవీందర్, పోలబోయిన శారదజగన్మోహన్, బోడ పార్వతిక్రాంతి, రిషిప్రియ, మెరుగు జ్యోత్స్న, శ్రీకాంత్, వరంగల్ వైష్ణవి జ్యూవెల్లర్స్‌లు పాల్గొని అయ్యప్పస్వామికి అభిషేక పూజలు నిర్వహించి అయ్యప్పస్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సైఫ సురేష్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, చంద్రశేఖరం, ఈశ్వరయ్య, సర్వేశం, శంకరయ్య, వేణుగోపాల్, రవీందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


23 నుంచి ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న బెల్లం కార్తీక్

వర్ధన్నపేట: ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు ఈనెల 23 నుంచి 25 వరకు 43వ రాష్ట్ర మహాసభలు సిద్దిపేటలో జరుగనున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెల్లం కార్తీక్ తెలిపారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్లను పట్టణ కేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు. విద్యార్థులు, ప్రముఖులు, పూర్వ కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. నగరకార్యదర్శి జీవన్, సంయుక్త కార్యదర్శి సన్నీ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

చెన్నారావుపేట: అసెంబ్లీ సమావేశాల్లో గొల్ల కురుమల సమస్యలు చర్చించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న చేపట్టిన చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని జీఎంపీఎస్ మండల కార్యదర్శి జక్క రవి పిలుపునిచ్చారు. మండలంలోని ఖాదర్‌పేట, జల్లీ, గొల్లపల్లి, చెన్నారావుపేట గ్రామాల్లో ఈ నెల 19న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల ఉపాధ్యక్షులు కుండె కుమారస్వామి, వెంకటేశ్వర్లు, కట్టయ్య, కుమారస్వామి, రవి, రాజు, మహేందర్, రజినికాంత్, తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌కు అంబేడ్కర్ జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న కేదాసి మోహన్

గీసుకొండ: మండలంలోని బొడ్డుచింతలపల్లికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు-2024 అందుకున్నారు. ఈ మేరకు న్యూఢిల్లీలోని బహుజన సాహిత్య అకాడమీ 17వ జాతీయ సదస్సులో ఈ అవార్డును బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ అందజేశారు. ఇప్పటికే మోహన్‌కు దళితరత్న అవార్డు రాగా తాజాగా అంబేడ్కర్ జాతీయ అవార్డు రావడం విశేషం.